# ‘విజేత’ శమంత

---

యద్దనపూడి సులోచనారాణి

ఎమెస్కో



# పూర్వాశ్రమం

నా పేరు శమంత. అమ్మా – నాన్నల గారాబంతో, నా బాల్యం ముద్దు మురిపాల తీపి గుర్తులతో గడిచిపోయింది. భగవంతుడు కరుణామయుడు. నాకు అందమైన రూపాన్ని ఇచ్చాడు. నాకు చక్కగా అలంకరించుకోవటం అంటే చాలా ఇష్టం.

ఎవరైనా నన్ను చూసి "మీ అమ్మాయి బంగారు బొమ్మలా ఉంటుంది" అని అమ్మ దగ్గర ప్రశంసిస్తుంటే, విన్న నా హృదయం వుప్పొంగిపోయేది. అప్పుడప్పుడూ అమ్మ సగర్వంగా నన్ను దగ్గరకు తీసుకుని, నా తల మీద చేయివేసి నిమురుతుంటే, నేను సంతోషంగా ఆమె గుండెలకి తల ఆనించి గువ్వలా ఒదిగిపోయేదాన్ని. కళ్ళు మూసుకుని, అమృతంలాంటి అమ్మ స్పర్శ, నా నరాల్లోకి ప్రవహిస్తుంటే నా మనసు, గువ్వపిట్టలా, రెక్కలు చాచుకుని ఆనంద లోకాల్లోకి ఎగిరిపోయేది. నా చదువు – నా అలంకరణ, పెళ్ళిళ్ళకి – పార్టీలకి సంతోషంగా పరుగెట్టడం, అమ్మా నాన్నల దగ్గర గారాబం – వీటితో నా జీవితం – దాదాపు – ఇంద్రధనస్సు మీద నేను రాజకుమార్తెలా వయ్యారంగా కూర్చున్నట్టే 18 సంవత్సరాలు చకచకా పరుగులు దీశాయి.



అందరి ఆడపిల్లలకంటే – ఎందుకో నాకు త్వరగానే పెళ్ళి అయిపోయింది. నాకు 18 సంవత్సరాల వయసులో నెల్లూరి వారి కుటుంబంలోని శ్రీనివాస్‌తో పెళ్లి నిశ్చయం అయింది. శ్రీనివాస్‌కి అప్పటికి 23 ఏళ్ళు. మా అమ్మా నాన్నలకి అంతా ఖచ్చితమైన పద్ధతి. నా పెళ్లిని వారు జరిపించిన వైనం, పెళ్లి కూతురుగా నన్ను చూసి, బంధువులంతా ప్రశంసిస్తుంటే నాన్న కళ్ళల్లో గర్వం, ఆనందం. అమ్మ వచ్చి నా గడ్డం పుణికి ముద్దు పెట్టుకుంటే, నేను ఆమెని కౌగలించుకుని భుజం మీద తల ఆనించుకోవటం, ఆ క్షణంలో నా మనసు ఆనందపారవశ్యంతో పురివిప్పిన నెమలి అవటం.... ఇదంతా నాకు ఎప్పటికీ మరుపురాని, ఎప్పటికీ నా నుంచి విడిపోని ఆనంద పరిమళ అనుభవం! ఎందుకో తెలియదు అమ్మ స్పర్శలో ఆ మాతృత్వపు ఆత్మీయత నా మనసుని ఎప్పుడూ ఆనందడోలికల్లో వూగించేది.

***





# వివాహం - సంసారం

నేను పెళ్లిని గురించి గాని – సంసార జీవితం గురించి గాని పెద్దగా ఎప్పుడూ ఆలోచించలేదు. నాకు శ్రీనివాస్‌తో పెళ్లి అయిపోయింది. మాది పెద్దలు నిశ్చయం చేసిన పెళ్లే అయినా శ్రీనివాస్‌కి, నాకు మనసులు కలిసిపోయాయి. నాకు పెళ్లికి ముందుగాని – తర్వాత గాని, ఎప్పుడూ, ఎక్కడా "ఇదేమిటి?" అని ఆలోచించే సమయమే లేదు.

అత్తవారి ఇంటికి రాకతో – నాకు గారాబం రెట్టింపు అయింది. శ్రీనివాస్ నాకు అహర్నిశలూ తోడు. కానీ, ఒక్కటే అతని విషయం నన్ను కాస్త బాధించేది. శ్రీనివాస్ మితభాషి. అన్నీ వింటాడు. అవసరం అయినప్పుడు తప్ప జోక్యం చేసుకోడు. ఎక్కువ మాట్లాడడు. మా అత్తగారు కొడుకుని 'నిండుకుండ' అన్నట్టు చూసేది. నాకు ఇది కూడా నా లాభమే అన్పించింది. ఎందుకంటే ఎక్కువ నేనే మాట్లాడవచ్చు కదా!

నా జీవితంలో అన్నీ త్వరత్వరగానే అయిపోతున్నాయి. మాకు పాప పుట్టింది. హర్షిణి అని పేరు పెట్టుకున్నాం. నా జీవితంలోకి చిన్నారి హర్షిణి రాకతో నాకు ఇంకో అమృత కలశం దొరికినట్టయింది. నేను హర్షిణిని ముద్దాడటం – తనతో ఆడుకోవటం మాత్రమే

చేసేదాన్ని. పెంచటం అంతా అమ్మే చూసుకునేది. హర్షిణిని గుండెలకి హత్తుకుంటే, నా శరీరం – మనసూ రెండూ, ఆనంద విద్యుత్ ప్రకంపనలతో నిండిపోయేది.



ఒక్కోసారి అమ్మ హర్షిణిని ఒడిలో కూర్చోపెట్టుకుని – ముద్దు చేస్తుంటే, నేను వెనకగా వచ్చి అమ్మని – అమ్మ ఒడిలో వున్న హర్షిణిని గాఢంగా కౌగలించుకునేదాన్ని. చెబితే మీరు నమ్మరేమో! ఆ సమయంలో – ఎందుకో నా కళ్ళల్లోకి నీళ్ళు వచ్చేసేవి. బాధలు పడితేనే కళ్ళల్లోకి నీళ్లు వస్తాయని విన్నాను. కానీ, ఆనందంలో కూడా కళ్ళలో నీళ్ళు వచ్చేస్తాయని నాకప్పుడే తెలిసింది. హర్షిణి పుట్టిన తర్వాత కూడా నా అలంకరణలో – పార్టీలకి తిరిగే ఉత్సాహంలో – నా జీవితంలో ఎలాంటి మార్పూ లేదు. శ్రీనివాస్ – నేను చాలా ఆనందంగా గడిపేవాళ్ళం. ప్రేమించుకోవటం ఒకరికోసం ఒకరు విరహంతో ఎదురుచూడటం – పెళ్లి అవుతుందా లేదా అని వేదనపడటం – ఇవేవీ మాకు తెలియవు. పెళ్లి అయింతర్వాత మా యిద్దరికీ ఒక్కటి మాత్రం బాగా తెలిసింది. మేం ఒకరిని ఒకరు కాకుండా, ఇంకెవ్వరిని చేసుకున్నా – ఇంత సుఖపడే వాళ్ళం కాదు. దేవుడు మమ్మల్ని ఒకరికి ఒకరు సరైన జోడి అని ఎన్నిక చేసి ఆశీర్వదించటం మా అదృష్టం. నా జీవితం అప్పటివరకూ ఆనంద సముద్రంలో ఆటు పోట్లు లేని ఆనంద నావలా తేలిపోతోంది.

***



# శరీరంలో మార్పు

నా శరీరంలో తరచుగా ఒక మార్పు రావటం నేను చాలా కాలం వరకూ పెద్దగా పట్టించుకోలేదు.

అసలు గమనించనే లేదు.

నాకేమీ అనారోగ్య సమస్యలు లేవు. నాది చాలా ఆరోగ్యవంతమైన శరీరం. చిన్నప్పుడు కూడా నా క్లాస్‌మేట్స్‌లో కొందరిలో చీటికి మాటికి జలుబు రావటం, జ్వరంతో పక్క ఎక్కటం చూసేదాన్ని. అలాంటివి నాకు అస్సలు తెలియదు. బంధువులు అమ్మతో 'శమంత ఎప్పుడూ కడిగిన ముత్యంలా వుంటుంది' అని అభినందించటం మాత్రమే నాకు తెలుసు. ఆరోగ్యంతో నా శరీరం, నా మనసు లేడి ఎప్పుడూ చీకూచింతా లేని పిల్లలా గంతులు వేస్తూ వుండేది.

అలాంటిదాన్ని ఉన్నట్టుండి అప్పుడప్పుడూ నీరసపడేదాన్ని. నేను దాన్ని లక్ష్యపెట్టలేదు. ఫ్రెండ్స్ కొంత మంది "ఏమిటీ చిక్కిపోతున్నావు? డైటింగ్ చేస్తున్నావా" అనేవారు. నేను ఇవేం పట్టించుకోలేదు.

కానీ, రాను రాను నీరసం ఎక్కువ అవసాగింది. ఒక్కోసారి అలాగే నీరసంతోనే ఏ బర్త్‌డే పార్టీకో వెళ్ళటానికి తయారయేదాన్ని.

అలంకరించుకుని అద్దంలో ముఖం చూసుకుంటే – మిలమిలలాడే నగల మధ్య రెట్టింపు కళతో వుండాల్సిన నా ముఖం వడిలిపోయిన పువ్వులా వుండేది.

'ఏమైంది నాకు?' అద్దంలో ప్రతిబింబాన్ని ప్రశ్నించేదాన్ని.

వెంటనే నవ్వేసుకుంటూ, 'ఏమైందా! ఆనందం ఎక్కువైంది' అని జవాబు చెప్పుకునేదాన్ని.

కానీ అది క్షణికమే. నాకు పార్టీకి వెళ్ళలేనంత నీరసం. నేను బలవంతంగా పార్టీకి వెళితే అక్కడ కూర్చోలేనట్టు – ఎప్పుడు ఇంటికి వెళ్తానా అన్పించేది. ఇంటికి రాగానే కాళ్ళకున్న చెప్పులు విదిలించేసి, హ్యాండ్ బాగ్ గిరాటేసి, మంచం మీద కుప్పలా వాలిపోయేదాన్ని. కాలు – కీలు కదల్చలేనంత నీరసం.

ఏమైంది నాకు! ఇప్పుడేగా! పార్టీలో రకరకాలు తిన్నాను. అయినా ఆరు నెలలు క్రిందట అన్నం తిన్నంతలా ఈ నీరసం ఏమిటి! ఒళ్ళు వేడిగా వుండేది. శరీరంలో భయంకరమైన అలసట.

చివరికి అమ్మా – నాన్నల పోరుతో డాక్టర్ దగ్గరకి వెళ్ళాను. ఆయన రొటీన్‌గా బ్లడ్ టెస్ట్ వ్రాశాడు.

